# మినీ కథలు:

## లౌక్యం



మునాఫ్

ఇద్దరు మనుషులు చేతుల్లో కర్రలు తీసుకొని పదిపన్నెండు పశువుల్ని తోలుకుంటూ వస్తున్నారు. ఓ పన్నెండేండ్ల పిల్ల ఏడుస్తూ వాళ్ళని బ్రతిమాలుతూ ఆ పశువుల వెంటే వస్తున్నది.

రేడియోలో చిత్రసీమ కార్యక్రమంలో పాటలు వస్తున్నాయి. నేను భోంచేసి వరండాలో పడక్కుర్చీలో సిగరెట్టు దమ్ము లాగుతూ అలవోకగా ఆ సీన్ని చూస్తున్నాను.

"అయ్యా! అయ్యా! మీకు పుణ్యముంటుందయ్యా! పశువుల్ని బందెల దొడ్డికి తోలకండయ్యా! మా అయ్య నన్ను చంపేస్తాడు ఈ ఒక్కసారికి పోనివ్వండయ్యా" అంటూ ఆ పిల్ల కాళ్ళావేళ్ళబడి వేడుకుంటున్నది.

ఆ పిల్ల మాటలకు ఆ ఇద్దరిలో ఎవరూ కరగలేదు.

ఇంతలో....

అరవై యేళ్ళ ఓ ముసలావిడ అక్కడికి వచ్చింది. ఆమె కావలివాళ్ళను దాటి పశువుల మందను తప్పుకుంటూ ఆ పిల్లను సమీపించింది. అకస్మాత్తుగా ఆ పిల్లని ముసలావిడ ఆ చెంపా, ఈ చెంపా వాయించింది.

లబోదిబో మంది ఆ పిల్ల.

కావలివాళ్ళు అలాగే చూస్తూ నుంచుండిపోయారు.

"దొంగముండా మళ్ళీ ఏడుస్తావేం? నీకెన్నిసార్లు చెప్పాలి, పశువుల్ని మేపడానికి తోలుకెళ్తే కాస్త ఒళ్ళు దగ్గర పెట్టుకొని వుండమని. పశువుల్ని వాటి మానాన వదలి, నువ్విష్టమొచ్చినట్లు చెట్టూ చేమ లెక్క ఆడుతుంటావా?" అంటూ గదమాయించింది.

పాపం ఆ పిల్ల బిక్క చచ్చిపోయింది. కళ్ళు తుడుచుకుంటూ "లేదత్తా! నేను ఆడుకోలేదు. నీళ్ళు తాగుదామని అటా చెరువు కెళ్ళానో లేదో అవి చేలో పడ్డాయి. అక్కడికి తొందరగానే పరుగెత్తుకొచ్చాను." అంది వెక్కుతూ.

"మళ్ళీ నోరెత్తుతావా భడవా! నా తమ్ముని కడుపున చెడబుట్టావే! నీ పశువులు పొలాల్లో మేయకపోతే, ఇదిగో ఈ పెద్ద మనుషులు ఎందుకు వాటిని బందెకు తోలుకొస్తారు? మళ్ళీ వాళ్ళనే బుకాయిస్తావా?" అంటూ మళ్ళీ రెండు దెబ్బలు వేసింది.

ఆ పిల్ల దెబ్బలు తప్పించుకోడానికి అటూ ఇటూ పరుగెత్తసాగింది.

కావలివాళ్ళు ఏం చేయాలో తెలియక చేష్టలుడిగి నుంచుండిపోయారు.

వెంటనే ముసలావిడ తన స్వరాన్ని కోమలంగా మార్చి, రెండు చేతులు జోడించి "బాబూ, మీరు మంచివాళ్ళు కాబట్టి సరిపోయింది. లేకపోతే - ఈ రోజు ఈ పశువుల్ని బందెకు తోలివుంటే మా గతి ఏమయ్యేది? ముప్పయి నలభై అచ్చుకోవాల్సివచ్చేది. ఇదిగో, ఈ ముదనష్టపు ముండ చేసినపనికి దాని అబ్బ దాని ఒళ్ళు చీరేసేవాడు" అంటూ పశువుల్ని వెనక్కి మళ్ళించింది.

"ఇంకేమిటే పాడు మొహందానా! అలా దెయ్యంలా చూస్తూ నుంచుంటావేం? పశువుల్ని తోలుకొనిపో. ఆ మారాజులు కాబట్టి వదిలేశారు. లేకపోతే ఈ రోజు నీకు మూడేది. పో! పో! మళ్ళీ ఈ సారి ఇట్లా చేశావా, నీ తోలు వలిచేస్తాను ఏమనుకుంటున్నావో" అంటూ హూంకరించింది.

ఒకవైపు పిల్లదాన్ని దండిస్తూ, ఇంకో ప్రక్క పశువుల్ని ఇంటిదిశ మళ్ళించింది. ఆ పిల్ల బ్రతుకు జీవుడా అంటూ గబగబ పశువుల్ని తోలుకెళ్ళింది.

కావలి వాళ్లు పశువులవైపు నిస్సహాయంగా చూస్తూ నుంచుండిపోయారు. ★

---

ఓ నాడు—

అనుకోకుండా ఆ నగరానికి ఓ సర్కస్ కంపెనీ వచ్చింది.

ఆ కంపెనీలో ఏవో ఉద్యోగాలు ఖాళీగా వున్నాయని ఎవరో చెప్పగా విని, ఎందు

## ఉద్యోగం కథ



జయంపుకృష్ణ